క్లుప్తంగా

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కిష్టాపూర్‌లో ప్రింటింగ్ మిషన్ ప్రారంభిస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): గ్రామాల్లో బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఆశాలత అన్నారు. మంగళవారం మండలంలోని అంగడికిష్టాపూర్‌లో బ్యాంకుమిత్ర కేంద్రంలో ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బ్యాంకు మిత్ర ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు బ్యాంకు సేవలు విస్తరించనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మిత్ర వినోద, సర్పంచ్ లక్ష్మీ రాములుగౌడ్, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, ప్రజ్ఞాపూర్ బ్యాంకు మేనేజర్ సూరజ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



కొండపాకలో సమ్మె చేస్తున్న వీఓఏలు

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని ఐకేపీ కార్యాలయం వద్ద వీఓఏల సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా వీఓఏల సంఘం నాయకులు శంకర్, అనిత, ప్రమీల, చంద్రకళలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. లక్ష్మి, అరుణ,లక్ష్మి, రేణుక, పుష్ప, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరలో భక్తుల సందడి



క్యూలో భక్తులు

హుస్నాబాద్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వెలుపల బైండ్ల పూజారులు పట్నాలు వేసి అమ్మవారి కథ వినిపించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుడుకలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



జలాభిషేకం కోసం నీళ్లు తెస్తున్న గౌడ సంఘం నాయకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీ సూరమాంబ కంఠమహేశ్వరస్వామి విగ్రహ ఆవిష్కరణకు ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం, కుంకుమాభిషేకాలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో కంఠమహేశ్వ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి



తహసీల్దార్ ఆరిఫాకు వినతి పత్రం అందిస్తున్న వెంకట్ మావో

చేర్యాల(సిద్దిపేట): అర్హులైన పేదలందరికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్ మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ ఆరిఫాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రె శ్రీనివాస్, బోయిని మల్లేశం, చంద్రం, సత్తయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సోయం బాపురావు మాటలు బాధాకరం

చేర్యాల(సిద్దిపేట): మత మార్పిడి చేస్తే బుల్లెట్ దింపుతాం అంటూ, అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న సోయం బాపురావు మాటలు బాధాకరమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌రావు హెచ్చరించాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడై ఉండి మత విద్వేశాలు రెచ్చగొడుతున్న బాపురావును ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలి

వర్గల్ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్

వర్గల్(గజ్వేల్): రైతులను కేవలం వరి పంట సాగుకే పరిమితం చేయకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వర్గల్ ఎంపీపీ జాలిగామ లత అన్నారు. మంగళవారం ఎంపీపీ లత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. జడ్పీటీసీ బాలమల్లుయాదవ్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలన్నారు. పశువైద్యాధికారిణి డాక్టర్ స్రృజన మాట్లాడుతూ రెండోవిడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హరిత సూచించారు. ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి, రైతు బంధు మండల అధ్యక్షుడు పాశం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

దుబ్బాక: రాయపోల్ మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ కల్లూరి అనిత అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలలో బయో కంపెనీ మందులను వాడడం వల్ల పంట దిగుబడులు తక్కువగా వస్తున్నాయన్నారు. దిగుబడులు ఎక్కువగా వచ్చే మందులను విక్రయించేలా వ్యవసాయ అధికారులు సూచనలు చేయాలన్నారు. అనంతరం అంకిరెడ్డిపల్లి సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలకు ప్రజలు చెరువుల నుంచి మొరం తెచ్చుకుంటే రెవెన్యూ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. బేగంపేట సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పెద్ద చెరువుకు మరమ్మత్తులు చేయిస్తే నిధులు విడుదల కాలేదని వాపోయారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలను త్వరలో పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ మున్నయ్య, జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, పీఎస్‌సీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లత



దుబ్బాక: మాట్లాడుతున్న ఎంపీపీ కల్లూరి అనిత



మాట్లాడుతూన్న తిరుపతిరెడ్డి

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రైతులు పండించిన ధ్యాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సొసైటీ క్యాష్ కౌంటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి మద్దూరు మండలంలో సొసైటీ ఆధ్వర్యంలో 11ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ సీఈఓ శ్రీధర్ పాల్గొన్నారు.

డబ్బులు వెంటనే చెల్లించాలి

హుస్నాబాద్: ధాన్యం అమ్మి నెల రోజులు గడిచినా నేటికి డబ్బులు చెల్లించలేదని ప్రభుత్వం వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని భారతీయ కిసాన్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. అక్కడ ధాన్యం కొనుగోలు తీరుపై రైతులతో చర్చించారు. కేంద్రం వద్ద ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. మండల అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చూడాలి

నంగునూరు(సిద్దిపేట): అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా కవర్లు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య రైతులకు సూచించారు. మంగళవారం రాంపూర్‌లోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్ ఫామ్ ఫెడరేషన్ ఫార్మర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డితో కలసి సారయ్య తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, పర్శరాములు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం కార్యకర్తలతో కలిసి చేర్యాల వ్యవసాయ మార్కెట్లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం కురిసిన వర్షానికి రైతులు నింపిన ధాన్యం బస్తలు తడిసిపోయాయని వాటిని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కుమార్, మల్లేశం, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సారయ్య

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: మున్సిపాల్టీలో ప్రధానంగా రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని 18వ వార్డులో పోస్టాఫీసు ప్రధానరోడ్డు సమీపం నుంచి మార్కండేయ టెంపుల్ వెళ్లేదారిలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాల్టీలో ఇరుకు రోడ్లను వెడల్పు చేయడమే కాకుండా ప్రజలకు అవసరంగా ఉండేందుకు కొత్తగా రోడ్లు వేయడంపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపాల్టీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు తుమ్మ భాను, భూత్ అధ్యక్షుడు అంకం దుబ్బయ్య, సోషల్ మీడియా ఇంచార్జి గోనె మధు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న గన్నె వనిత

బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా చంద్రకళ



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ చైర్పర్సన్‌గా కచ్చు చంద్రకళ, వైస్ చైర్మన్‌గా హనుమండ్ల లక్ష్మారెడ్డితో పాటు 16మంది డైరెక్టర్లను నియమించారు.

కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ కృషి



దుబ్బాకటౌన్: దేశంలోని అన్ని వర్గాల కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా కోషాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం దుబ్బాకలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొంపల్లి భాస్కర్, మల్లేశం, శ్రీనివాస్, కృష్ణహరి, పర్శరామ్, జమున, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన బుర్ర నిశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం వారి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు దరువు ఎలన్న పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దొనే అశోక్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

గోదాముల రేకులను వెంటనే సరిచేయాలి

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సాక్షి ఎఫెక్టు

దుబ్బాకరూరల్: దుబ్బాక వ్యవసాయ మార్కెట్ గోదాము రేకులు ఇటీవల కురిసిన వడగండ్ల వానకు లేచాయి. రేకులు లేచి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించడం లేదు. ఇటీవల 'సాక్షి దిన పత్రికలో ఈదురు గాలులకు గోదాం పైకప్పు ధ్వంసం' అనే వార్త ప్రచురిత మైంది. దీంతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు విషయం తెలుసుకుని వ్యవసాయ మార్కెట్ గోదాంను మంగళవారం సందర్శించారు. గోదాం రేకులు లేచి రెండు నెలలు గడుస్తున్నప్పటికి సంబంధిత అధికారులు స్పందించక పోవడం బాధకరమన్నారు. నాణ్యతతో కూడిన రేకులను వేయాలని అధికారులను ఆదేశించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితురాలికి మంగళవారం అందజేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మల్యాల గ్రామానికి చెందిన రజిత నాలుగు రోజుల క్రితం సిద్దిపేట బస్టాండ్ ప్రాంతంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రవికుమార్, సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ యాప్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. అనంతరం ఫోన్ రికవరి చేసి బాధితురాలికి సీఐ అందజేశారు. సీఐ వెంట మహిళ కానిస్టేబుల్ చిత్రయాదవ్ తదితరులు ఉన్నారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీఐ రవికుమార్

కోమటిచెరువు సుందరీకరణ పరిశీలన



కోమటిచెరువును సందర్శించిన మానకొండూర్ ప్రజాప్రతినిధులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటి చెరువు సుందరీకరణను మానకొండూర్ ప్రజాప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచన మేరకు చైర్మన్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులతో కూడిన ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించారు. అనంతరం నివేదిక రూపొందించారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే రసమయి రూ.2.5 కోట్లతో కోమటి చెరువు తరహాలో అక్కడ చెరువును సుందరీకరణ చేసే క్రమంలో అధ్యయనం కోసం ప్రజాప్రతినిధులు సిద్దిపేటను సందర్శించారని వారు పేర్కొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించుకుందామని రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్ సూచించారు. మండల కేంద్రమైన కొండపాకలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురిరెడ్డి, ఎంపీడీఓ రాంరెడ్డిలతో కలిసి రైతు వేదిక భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను, 33 జిల్లాలుగా సీఎం కేసీఆర్ మార్చారన్న విషయాన్ని విరివిగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, వ్యవసాయాధికారి ప్రియదర్శిణి, ఎంఈఓ వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో కొలువుదీరిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ దాసరి అమరావతి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోగల మండల పరిషత్ సమావేశ హాల్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి ఆమె మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతం సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములు పచ్చని పంటపొలాలతో సస్యశ్యామలంగా మారాయన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరిగినట్లు తెలిపారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను చేపట్టి అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం నింపారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ రాజిరెడ్డితో పాటు ఎంపీడీవో మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు(గజ్వేల్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ములుగు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్ సూచించారు. ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతి స్పెషల్ అధికారులతో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, మండల రైతు సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అర్జున్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కొండపాక: సమావేశంలో మాట్లాడుతున్న దేవి రవీందర్

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

దుబ్బాక: సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైనా రూ.14 వేల చెక్కును మంగళవారం గొల్లపల్లి బాల్ లక్ష్మీకి సర్పంచ్ అప్పవారు శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు మెరుగైనా వైద్యం పొందడానికి సీంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉప సర్పంచ్ నర్సవ్వ నరేందర్ రెడ్డి, ప్రవీణ్, రాజు, యాదయ్య, కనకయ్య, నిఖిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుల హక్కుల కోసం పోరాటం

మద్దూరు(హుస్నాబాద్): కార్మిక హక్కులకై నిరంతరం పోరాడేది సీఐటీయూ మాత్రమేని దూల్మిట్ట నాయకులు సిద్దులు అన్నారు. మంగళవారం 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970నుంచి నేటి వరకు రాజిలేని పోరాటలు చేసి అనేక హక్కులను సాధించుకున్నామన్నారు. సత్యనారాయణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణం 17వ వార్డులోని ఓ ప్రైవేటు పాఠశాలలో వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో వ్యాధిని ముందుగా గుర్తించడం ద్వారా వారికి సరైన చికిత్స అందించవచ్చని తెలిపారు.

◆ 5కే రన్ విజయవంతం చేయండి

దుబ్బాక: జూన్ 1న నిర్వహించబోయే 5కే రన్ విజయవంతం చేయాలని దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 5.30 గంటలకు దుబ్బాక బస్టాండ్ నుంచి హబ్సీపూర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 5కే రన్ నిర్వహిస్తున్నామన్నారు.

◆ నేడు పొగాకు నివారణ అవగాహన

సిద్దిపేటకమాన్: పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఉప కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లో పొగాకు సంబంధిత ఉత్పత్తులను సేవించడం వల్ల కలిగే అనార్థలపై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించనున్నట్లు డీఎంహెచ్ఓ కాశీనాథ్ తెలిపారు.

◆ ఇంకుడుగుంత ఏర్పాటు

జగదేవ్‌పూర్(గజ్వేల్): నీటిని వృథా చేయకుండా ఉండేందుకు కమ్యూనిటీ ఇంకుడుగుంతలకు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేశారు. మండలంలోని తిగుల్ గ్రామంలో కుడిగుంట సమీపంలోని మురికి కాల్వ దగ్గర ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. దీన్ని నిర్మించి 3 రోజులు కాకముందే మంగళవారం కురిసిన వర్షానికి ప్రహరీ కూలిపోయింది. నాణ్యత లోపం వల్లే కూలినట్లు స్థానికులు వాపోతున్నారు.

◆ దాత సహకారంతో సీసీ రోడ్డు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం వేలూరు బొడ్రాయి వద్ద స్థలాన్ని దాత చీర్ల కుమార్‌యాదవ్ సహకారంతో మంగళవారం సీసీ వేసి చదును చేశారు. దీనికోసం దాత రూ.50 వేలు విరాళం అందజేశారు. మంగళవారం సర్పంచ్ పాపిరెడ్డి గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న స్థలాన్ని సీసీ రోడ్డు వేయించారు.

◆ తాడూరులో పౌరహక్కుల దినోత్సవం

చేర్యాల(సిద్దిపేట): తాడూరులో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పౌర హక్కులదినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఆరిఫా మాట్లాడుతూ పౌరుల హక్కులు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. సర్పంచ్ నర్ర ప్రేమలత మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, చేర్యాల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ ధరణి పోర్టల్‌లో భూ మార్పిడిపై ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో గల వ్యవసాయ భూమిని ధరణి పోర్టల్‌లో మార్పిడి జరిగిందంటూ ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ జీవన్ పాటిల్‌కు బాధితురాలు బోయినిపల్లి విజయ ఫిర్యాదు చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని వారు కోరారు.

◆ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని మండల యూత్ అధ్యక్షుడు ధర్మారం కుమార్ తెలిపారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ యూత్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిరుదొడ్డి యూత్ కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. మిరుదొడ్డి బీఆర్ఎస్ యూత్ కమిటీ అధ్యక్షుడుగా మద్దెల నరేష్, ఉపాధ్యక్షుడిగా పసులకాడి తిరుపతి, ఎర్రోల్ల చందు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ధర్మారం శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ధర్మారం లక్ష్మి, కో ఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, కమిటీ బాధ్యులు బుర్ర సతీష్, నాయకులు నరేష్, నవీన్, రాకేష్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ గ్రామ కమిటీల ఎన్నిక

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్, బంజేపల్లి గ్రామాల యూత్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాన్గల్ యూత్ అధ్యక్షుడిగా లింగుపల్లి బాల్‌రాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నిమ్మరాజు నరేష్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా తరిగొప్పుల చరణ్‌లను ఎన్నుకున్నారు. బంజేరుపల్లి యూత్ అధ్యక్షుడిగా వెంకటయ్య గారి స్వామి, ఉపాధ్యక్షుడిగా గణేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా శ్రీకాంత్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పుల్ల యాదగిరి, ఉపాధ్యక్షుడిగా లింగ స్వామిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ మంజులసత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, మండల యూత్ అధ్యక్షుడు అరుస్ కుమార్, ఆత్మ కమిటీ, ఏఎంసీ డైరెక్టర్లు అనిల్ కుమార్, పాల్గొన్నారు.

◆ లబ్ధిదారులకు న్యాయం చేయాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్ నగర్, ఇంద్ర నగర్, కాళ్లకుంట కాలనీ జీఓ 59 లబ్ధిదారులకు న్యాయం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమామ్ డిమాండ్ చేశారు. ఆయన వెంట మల్లిక్, రషీద్, మధు, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

◆ కళలను కాపాడుకుందాం



సిద్దిపేట ఎడ్యుకేషన్: కళలను, సంప్రదాయాలను కాపాడుకుందామని ఏసీపీ దేవారెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత డప్పు శిక్షణ శిబిరం ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు ఒక కళ అని, సంప్రదాయాక చరిత్ర ఉందని, అది ఒక శబ్దం అన్నారు. మనిషి పుట్టిన రోజు నుంచి చనిపోయే రోజు వరకు జీవితంలో ఒక భాగం అయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోవైస్ ప్రిన్సిపల్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత క్యాంపు నిర్వహిస్తామని దీన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌సీ హెల్త్ కేర్ కో ఆర్డినేటర్ నవీన్ కోరారు. ఈ క్యాంపునకు సహకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, కమిషనర్ గణేష్‌రెడ్డిలకు సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

◆ వైభవంగా ప్రారంభమైన ప్రతిష్ఠోత్సవాలు

కొండపాక(గజ్వేల్): బందారం గ్రామంలో దుర్గా సహిత, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠోత్సవం మంగళవారం ప్రారంభమయ్యాయి. గోపూజ, గణపతి పూజ, అంకురార్పణం, యాగశాల ప్రవేశం, నవగ్రహ, దేవతా ఆవాహన, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసము, తీర్థ ప్రసాద వితరణను నిర్వహించారు.

◆ విగ్రహాల ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్తాత్రేయస్వామి, రేణుకామాత విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వరకు మహోత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దాత దారం వీరేశం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

◆ అమ్మవారికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి రేణుకాఎల్లమ్మ అమ్మవారి మొదటి వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.